టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- విద్యార్థులకు స్పెషల్ క్లాసులు
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక బోధన
- తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం

ముషీరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టెన్త్ వార్షిక ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా సమగ్ర ప్రణాళికలతో టీచర్లు ముందుకు వెళ్తున్నారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల తల్లిదండ్రులతో సైతం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పిల్లలు బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. స్పెషల్ క్లాస్‌లకు రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఫోన్లు చేసి ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.


పాఠశాలలో స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

మండల పరిధిలోని 7 ఉన్నత పాఠశాలల్లో 334 మంది విద్యార్థులకు రోజూ స్కూల్ సమయం కంటే గంట ముందు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యలో వెనకబడిన వారిని గుర్తించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యాబోధన చేయడంతో పాటు మెరిట్ విద్యార్థులు మరింత ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. అందుకు విద్యార్థులను గ్రూపులుగా విభజించి విద్యాబోధన చేయడంతో పాటు పాఠ్యాంశాలలో ముఖ్యమైన సబ్జెక్‌లను బోధిస్తున్నారు.

100 శాతం ఫలితాల కోసం కృషి



మండల పరిధిలో గతేడాది కంటే ఈ విద్యా సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించే విధంగా విద్యాబోధన చేస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాబోధన అందించడంతో పాటు విద్యార్థులకు మెటీరియల్ అందించాం. గ్రూపులుగా విభజించి విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తున్నాం.

- చిరంజీవి, ముషీరాబాద్ డిప్యూటీ ఈవో

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి



ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాం. స్పెషల్ క్లాసులకు హాజరయ్యేలా వారిని తీర్చిదిద్దుతున్నాం. సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయడంతో పాటు పరీక్షలు సైతం నిర్వహిస్తున్నాం.

-స్వరూపారాణి, ప్రధానోపాధ్యాయురాలు

విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేస్తున్నాం



స్పెషల్ క్లాస్‌లో విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ప్రతి అంశంపైనా పట్టు సాధించేలా విద్యాబోధన చేస్తున్నాం. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నాం.

- నరేందర్‌యాదవ్, ఉపాధ్యాయుడు

దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్స్ ఇవ్వాలి: ఎమ్మెల్యే

అంబర్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ట్రై వీలర్ సైకిల్ స్థానంలో బ్యాటరీ వీల్ చైర్స్ ఇవ్వాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో దివ్యాంగుల సాధికారిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. దివ్యాంగులకు 15 వీల్ చైర్స్, 30 సైకిల్స్‌ను అందజేశారు. కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, యాకరఅమృత, కన్నె ఉమాదేవి, మహాలక్ష్మి, యూసీడీ రజిత, డీఎంసీ మారుతిదివాకర్, బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, లవంగు అంజనేయులు, మహేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.


అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజుమాదిగ, కనకరాజు, మేరిమాదిగ

మాదిగల అభివృద్ధి కోసం సమగ్ర నివేదిక ఇవ్వాలి

కవాడిగూడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదిగ, ఉపకులాల జీవన స్థితిగతులపై ప్రత్యేక అధ్యయనం చేసి వారి అభివృద్ధి కోసం చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను అందజేయాలని కోరుతూ టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, మాదిగ మహిళా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలడుగు మేరిమాదిగలు బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ జస్టిస్ శమీన్ అక్తర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీదర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సురేష్‌మాదిగ, చిన్న, శ్రీనివాస్‌తదితరులతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై పార్కు చేసిన చెత్త రిక్షాలను తొలగించాలి

ముషీరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్ ప్రధాన రోడ్డు నల్లపోచమ్మ దేవాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా చెత్తను సేకరించే వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బాపూజీనగర్‌లో అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను పరిశీలించి జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసులకు పలు మార్లు ఫిర్యా దు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.


ఎమ్మెల్యే గోపాల్‌ను సన్మానిస్తున్న శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్

ప్రజల అండతోనే రెండు సార్లు విజయం: ఎమ్మెల్యే

ముషీరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల అండదండలతో రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి. డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, దీన్‌దయాల్ రెడ్డి, శివముదిరాజ్, ఉపాధ్యక్షులు టెంట్ హౌస్ శ్రీనివాస్, బల్లాప్రశాంత్, నాయకులు రవి యాదవ్ పాల్గొన్నారు.

ఆటో సంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

చిక్కడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 9 నెలల కిందట ఆటో సంఘాలతో జరిపిన చర్చల మేరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఆటో, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ప్రతినిధులు మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఎండి హబీబ్, ఎ.రవి, పల్లెర్ల రవిలు మంగళవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ నగర కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కిందట ఇచ్చిన హామీల అమలు విషయాన్నే ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. ఆటో, రవాణా కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏటా 12 వేలు ఇస్తామని తెలియజేసి ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడంతో డ్రైవర్లు నష్టపోతున్నారన్నారు. కాగా త్వరలోనే ఆటో, ప్రయివేట్ రవాణా సంఘాలతో చర్చలు జరుపుతామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.


మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జేఏసీ నేతలు


కవాడిగూడ ఏవీ కళాశాల వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరుతున్న బీజేపీ నేతలు

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

కవాడిగూడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం రమేష్‌రాంలు ఆరోపించారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో యువమోర్చా నగర అధ్యక్షుడు ఎం శివాజీ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్ ఏవీ కళాశాల భగత్‌సింగ్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీని రమేష్‌రాం, కార్పొరేటర్లు జి రచనశ్రీ, రవిచారి, మాజీ కార్పొరేటర్ టి రవీందర్, ఆలిండియా ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు. రాష్ట్ర నాయకులు బండారు విజయలక్ష్మి, భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు బీజేపీ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. ఈ బైక్‌ర్యాలీలో యువ మోర్చా నాయకులు సలంద్రి దిలీప్‌యాదవ్, నాయకులు శివరాజ్, అనిల్‌తోపాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

చిక్కడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ ఇళ్లను జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు అక్రమంగా కూల్చివేశారని తమకు న్యాయం చేయాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానంద నగర్ బస్తీ బాధితులు మంగళవారం జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వాన, సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఎంపీ డా. కె. లక్ష్మణ్ అప్పాయింట్‌మెంట్ ఇప్పించడంతో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్‌తో కలిసి బాధితులు ఎంబి కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు న్యూఢిల్లీలో కిషోర్ మక్వానను కలిసి వినతిపత్రం సమర్పించారు. వివేకానందనగర్ బస్తీకి చెందిన 19 దళిత కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని కిషోర్ మక్వాన హామీ ఇచ్చారని వివరించారు.


జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు


మాట్లాడుతున్న డి.ఒడ్డెన్న

విద్యార్థులకు ఇంటర్ కీలకదశ

బర్కత్‌పుర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంటర్‌మీడియట్ కీలక దశ అని, ఇళ్లలో విద్యార్థులు చదివేందుకు మంచి వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి.ఒడ్డెన్న అన్నారు. మంగళవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తుండడం వల్ల విద్యార్థులు తప్పనిసరిగ్గా తరగతులకు హాజరు కావాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు కీలకమైనదన్నారు. జూనియర్ కళాశాలలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.చిరంజీవి, సీనియర్ అధ్యాపకులు సి.శ్రీనివాస్‌రావు, గీతాబాయి, ప్రసాదరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున్‌కు ఉత్తమసేవా అవార్డు బహూకరణ

చిక్కడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి)రాష్ట్రఅధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్‌కు ఉత్తమ సేవా అవార్డును బహూకరించారు. రాష్ట్ర మహిళాశిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ అవార్డును బహూకరించారు. దివ్యాంగుల శాఖ ముఖ్యకార్యదర్శి అనితరామచంద్రన్, రాష్ట్ర కమిషనర్ శైలజ, ఎన్‌పిఆర్‌డి జాతీయ అధ్యక్షులు రాజేందర్ తుడుం, మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ వివరాలు చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌లు తెలిపారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రచ్చ శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

చిక్కడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రచ్చ శ్రీనివాస్ ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నికయ్యారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో సభ్యులందరూ శ్రీనివాస్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా వజ్రేష్, ప్రధాన కార్యదర్శిగా సనపురి వెంకటేష్, కోశాధికారిగా కైరంకొండ పాపయ్య, భిక్షపతిలను సభ్యులు ఎన్నుకున్నారు. రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని కూలి మృతి

బర్కత్‌పుర: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ కూలీ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్‌లో నివాసముంటున్న అరవింద్ కామ్లే(39) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి కూలి పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న అరవింద్ శివరాంపల్లి - ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ నడుమ పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు అతడిని బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'సంఘ్' పోరాటం


రాఘవయ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంప్లాయీస్ సంఘ్ పోరాటం చేస్తుందని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య స్పష్టం చేశారు. రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు బుధవారం నుంచి జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వేలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకాలకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ఉద్యోగులు, అధికారులు తమ ఓటును రైలింజన్‌పై వేసి సంఘ్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం ప్రయోజనాలను అందించేందుకు సంఘ్ కృషి చేస్తోందన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ డిగ్రీ, పీజీ చదువుతున్న బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని పిల్లలు అస్వస్థతకు గురై కొందరు చనిపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి అండర్-14 హాకీ క్రీడకు విద్యార్థుల ఎంపిక

అంబర్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్ 14 హాకీ క్రీడకు హైమావతి పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 14 విభాగంలో హైదరాబాద్ జిల్లా తరఫున అంబర్‌పేట ప్రేమ్‌నగర్ హైమావతి పాఠశాలకు చెందిన నందిని, మాళవిక, హర్షిత, దివ్యానంద, అక్షితలు బాలికల విభాగంలో అదే విధంగా వేణు, దినేష్‌కార్తీక్, అశ్వంత్‌లు బాలుర విభాగంలో ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ తెలిపారు. హాకీ క్రీడల పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పథకాల అమలులో తెలంగాణది ప్రథమ స్థానం

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ మొదటి స్థానంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల రుణమాఫీలో తెలంగాణ రికార్డ్ సాధించిందన్నారు. ఉచిత బస్సు, విద్యుత్, గ్యాస్, పంటలకు 500 రూపాయల బోనస్ అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో నడుస్తున్నాయన్నారు. బీసీల సంక్షేమం కోసం కులగణన కూడా నిర్వహిస్తున్నదన్నారు. యేడాదిలో 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీమంత్‌గిరి, తొలుపునూరి నరేష్‌కుమార్‌గౌడ్, జితేందర్ కురుమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

ఘంటసాల గాయకుడే కాదు.. ఉద్యమకారుడు కూడా..

చిక్కడపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల కేవలం సినీ గాయకుడు మాత్రమే కావని ఆయన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు అన్నారు. డిసెంబరు 4 ప్రఖ్యాత గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా ఘననివాళులు అర్పించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన ఈ సభలో జస్టిస్ కాశీవిశ్వేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఘంటసాల మరణించి యాభై ఏళ్లు దాటినా ఆయన పాటలు ఇప్పటికీ వినిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, వంశీకృష్ణ, బండి శ్రీనివాస్‌పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, పక్కన కళా జనార్దనమూర్తి

వరదనీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

అంబర్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో వరదనీరు సాఫీగా వెళ్లే విధంగా చేపట్టిన పైప్‌లైన్ పనులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 50 లక్షల వ్యయంతో అంబర్‌పేట స్విమ్మింగ్‌పూల్ నుంచి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు వరదనీరు నిలువకుండా పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. అంబర్‌పేటలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు లవంగు ఆంజనేయులు, మహేష్ ముదిరాజ్, ధరమ్, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

12 గంటలు ఘంటసాల గానవిభావరి

చిక్కడపల్లి: జనప్రియ ఫైన్ ఆర్ట్స్ దశమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన పన్నెండు గంటల గానవిభావరి ఘనంగా జరిగింది. చంద్రతేజ, వినోద్‌బాబు, అర్చన వెంకటేశ్వరరావు సంతోష్ కృష్ణమూర్తి సూర్యనారాయణమూర్తి పీసపాటి సోదరులైన శేఖరుడు, శేఖర్, అఖిల, అనంతలక్ష్మి పాడిన ఘంటసాల పాటలు శ్రోతలను మైమరపించాయి.

దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జీవితాలలో వెలుగులు నింపడానికి 1983 తెలుగుదేశం హయాంలో ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసిన ఘనత నాటి మాజీ సీఎం ఎన్టీఆర్‌దేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో దివ్యాంగుల వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా 100 మంది దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. వివిధ రంగాలలో ప్రముఖులైన దివ్యాంగులను ఆమె సత్కరించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ.. ప్రస్తుతం పాలకులు దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం విస్మరిస్తున్నాయని ఆరోపించారు. దివ్యాంగుల సాధికారత, ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతోపాటు బ్యాక్‌లాగ్ పోస్టులలో నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో 4 శాతం, బ్యాక్‌లాగ్ పోస్టుల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, దళిత బంధువు పథకం మాదిరిగానే దివ్యాంగులకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో దివ్యాంగురాలిని సత్కరిస్తున్న నారా భువనేశ్వరి

5న చలో ఆర్టీసీ బస్‌భవన్ మహాధర్నా

నల్లకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆర్టీసీ జేఏసీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ క్రాస్‌రోడ్ సమీపంలోని 5న చలో ఆర్టీసీ బస్‌భవన్ ముందు మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు. అనంతరం హైదర్‌గూడలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదుల వెంకన్న, వైస్ చైర్మన్ కమలాకర్‌గౌడ్, కో-కన్వీనర్లు సుద్దాల సురేష్‌కుమార్, కత్తుల యాదయ్యలు విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్‌లను అమలు చేయాలని, పే స్కేల్ ఇవ్వాలన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 5న జరిగే చలో ఆర్టీసీ బస్ భవన్ ముందు నిర్వహిస్తున్న మహాధర్నాకు ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.


కూనంనేనికి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు

'కాంగ్రెస్‌ది దోపిడీ పాలన'

బర్కత్‌పుర: రాష్ట్రంలో కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, దోపిడీ పాలన అని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మంగళవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జిషీట్‌ను విడుదల చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి యేడాది గడుస్తున్నా ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు.